**1983 ఉగాది కథానికల పోటీలో రు. 116/-లు కన్సొలేషన్ బహుమతి పొందిన కథ!**




**ప**గలంతా తీవ్రంగా కాసిన ఎండకి కొండలన్నీ బాగా వేడెక్కిపోయి ఇంకా చల్లపడలేదు.

కొండగాలి ఉండి ఉండి వేడిగా వీస్తోంది. ఎండ తీవ్రతకి కరడుగట్టి స్తంభించి పోయినట్టుండిపోయిన ప్రకృతిలో ఇప్పుడిప్పుడే కొంచెం కదలిక మొదలయింది. ఒకటీ ఒకటీ పిట్టలేవో రెక్కలు ఆడించడం మొదలు పెట్టాయి. సాయంకాలపు ఎండ ఏటవాలుగా పరుచుకుని కొండలు-తోమిన కంచుచెంబుల్లా మెరుస్తున్నాయి.

నిప్పులు కక్కిన అంత ఎండకి కూడా కొండలేవీ కరిగి నీరై పోలేదన్న అవమానంతో ఎర్రబడిపోయిన సూర్యుడు నెమ్మదిగా కొండల వెనక కునికిడానికి సిద్ధపడుతున్నాడు. ఆకాశం తాంబూలం వేసుకుంది. కొండలమీద పోడు ముట్టించేసినట్టు

న్నారు. మొదట చిన్న వెలుగు చుక్కలా కనిపించి, క్రమంగా రాజుకుని మండుతున్న ఆ మంటలు దూరానికి కొండమ్మ మెళ్ళో మందారాల దండలు వేసినట్టుగా కనిపిస్తున్నాయి.

అరులప్ప వడివడిగా నడుస్తూ చింతల తోపు చేరుకుంది. అప్పటి కక్కడ పొద్దు మరికొంచెం ముందుగానే గూకింది. చింతల తోపు చీకటి గుహలా వుంది. అరులప్ప చుట్టూ చూసి జనసంచారం లేకపోవడంతో హమ్మయ్య అనుకుంది. పచ్చగళ్ళ ముతక చీర కట్టుకుని చిరుగుల రవికె వేసుకుని వుంది. ముఖం సన్నగా కోలగా తిండికి వాచిపోయిన దానిలా ఉందామె. అటూ ఇటూ చూసి, చేతిలోని చింకి చీరని రెండు మడతలుపెట్టి నేలమీద పరిచింది. ఆ తర్వాత నేలమీద పడిన చింత బొట్టల్ని గబగబ ఏరడం ప్రారంభించింది. ఆపని ఆమే ఎంత వేగంగా చేస్తోందంటే— అప్పుడెప్పుడో— కుప్పలు తెప్పలుగా చిల్లర డబ్బులు కనిపిస్తే ఆబగా ఏరీసుకుంటున్నట్టు కిలొచ్చిందే. అంత వేగం. ఈయేడాది చింతవిరగకాసింది. బొట్ట కూడా యింత మందాన చూడానికే దిష్టి తగిలేలా ఉంది. మాకయ్య వొచ్చి లోగా తన పని పూర్తి చేసుకుని వెళ్ళిపోవాలని అరులప్ప తాపత్రయం పడుతూంది.

పురుగూపుట్రా భయం లేదు. చీకటంటే వెరపు లేదు.

ఒకటే భయం - తన నెవరేనా చూస్తారేమోనని!

'ఎవరూ సూడకుండా వుంటే ఈ సరుకుని తీసికెళ్ళి అమ్ముకోవచ్చు. రెండు రోజులకి బత్తెం వొస్తుంది. అయ్య కడుపునిండా యింత కూడుతిని చాన్నాళ్ళయింది. ఆకల్తో పేగులు నులుసుకుపోతున్నా తనతోపాటు గట్టుపనికి వొస్తున్నాడు. ఒదురియ్య అంటే ఇష్టు. ఎలపింటోడు ఎలగైపోనాడు! గట్టొచ్చినాది - తమ బతుకుల్లో బుగ్గి కలిపేస్పినాది. గట్టొస్తే కొందరికి సంబరం. కొందరి నోళ్ళలో దుమ్ముకొట్టిపోతాది.... గంగమ్మ తల్లికి గట్టేస్తే గట్టుకిందోళ్ళ బూవులు బంగారం పండుతాయి. బూవితల్లి ఏడాది పొడుగునా పచ్చ కోకలు కడతాది. ఆళ్ళ పిల్లా, జెల్లా, గొడ్డూ గోదా చల్లగుంటారు. నిజివే....కాని.... గట్టైగువోళ్ళగతేటి? ఆల్ల నెవులు సూస్తారు? ఆల్ల బతుకుల్లా నిప్పుల వొర్పం పడకండ సాయం సెయ్యాలి. సేస్తారు. అదీ నిజివే....కాని ఆ సాయం సేతులు మారి వొచ్చేసరికి తనలాటోళ్ళు బికార్లయిపోతున్నారు. నేకపోతే నచ్చునంగ రెండెకరాకాల బూవిని దున్నుకుని సుకంగ వుండేవాళ్ళం కాదా? ఇంట్ల గింజలకి కొదవుండేది కాదు. ఆ గింజలమేత్కదా అయ్య తనకి మనువు సేసినాడు! ముండాగండదు-తమ బూవులు పోయీసరికి తన పెనిమిటి. తనని ఒల్లి కోక ఒగ్గేసినాడు తమ బతుకులు సితికిపోనాయి. కొంప యీదిన పడిపోనాది.'

తలుచుకుంటూ వుంటే అరులప్పకి దుఃఖం పొర్లుకు వస్తోంది. ఆమె కళ్ళలో గిర్రున నీళ్ళు తిరిగి—చిక్కబడిన చీకటి తడితడిగా కనిపించింది. కొంగుతో కళ్ళు తుడుచుకుని తన పనిలో మునిగిపోయింది.

తలదించుకుని చింత బొట్టలేరుతున్న అరులప్ప— తననెవరో జబ్బపట్టుకుని గుంజడంతో తుళ్ళిపడింది. గుండె ఒక్కసారి కొట్టుకోడం మానేసినట్టయింది. భయంభయంగా తలెత్తి చూసింది. అప్పుడామె కళ్ళకి ఎదురుగా మాకయ్య— ఆపదకి రూపొచ్చినట్టుగా ఉన్నాడు. పడబోయే శిక్షకి సాక్ష్యంలా క్రూరంగానూ ఉన్నాడు. ఆ చింతలతోపు జడలుకట్టిన సాధువులా కాక— జుత్తు విరగబోసుకున్న దెయ్యంలా కనిపించింది. ఆ చీకటి నమ్మకమైన స్నేహితుడిలా కాక కబళించబోయే క్రూర జంతువులా తోచింది.

ఆమె జబ్బని బలంగా వొడిసిపట్టుకుని తినేసేలా చూస్తున్నాడు మాకయ్య.

ఆమె ముఖంలో ముఖం పెట్టి చూసి ఆమెను పోల్చుకున్నాక-

"ఎవలూ? అర్లీ,ఏటిసేస్తున్నావే?"అనడిగేడు.

## వెతుకులాట

సంగి దేనికోసం
పంగి వెతుక్కుంటుంది ?
నేల దేనికోసం
నీలంగా సాగుతుంది ?
కాసారమెవరికోసం
కన్నార్పకచూస్తుంది ?-
ఆకలిదప్పులు లేని గాలి
వాకిళ్ళెందుకు తెరుస్తుంది ?
బొడ్డులో కన్ను తాపుకుని
బావి ఏమి గాలిస్తుంది ?
ఒక్కచోటనే చెట్టు నిత్య
మెక్కడికి ప్రయాణిస్తుంది ?

—ఇస్మాయిల్

అరులప్పకి గొంతు పిడచకట్టుకుపోయింది. వొళ్ళంతా చెమటతో ముద్దగా తడిసిపోయింది. కాళ్ళలో వణుకు మొదలయింది.

"గాలికి బొట్టలు కింద పడితేనూ, ఏరుకుంతన్నాన్రయ్య- మరేటేన్నేదు.... అయ్యకింత వుప్పురవ్వేసి సింతపండు సారు కాసిద్దావని...."తడబడుతూ అంది.

"నియ్యవ్వ. అయితిదేనేటి నువ్వ సేసీ పని.... కిట్టయ్య బాబు ఏటని చాటింపేయించినాడు? ఆపీసర్లొచ్చి సింతసెట్లు ఏలం వేసేవరకు ఆటికాసి ఎవలూ సూడొద్దని కాదు?"

అరులప్ప తల దించేసుకుంది.

"నీ గేనం గడ్డి తిందేటే? పద ఆ బాబు కాడికి. ఊ బేగ పద."

భళ్ళున నీటికుండ బద్దలయినట్టు ఏడుస్తూ కూచుండిపోయింది అరులప్ప.

"నాను రాను బాబు ఆరికాడికి.... నన్నొగ్గిరా నీకు దండవెడతాను. నాతప్పుకాయి.. నేనేరిందంతా, యిదిగిక్కడే. వొగ్గి సెలిపోతాను....బాబ్ బాబు ఈ పాలికి నన్నొగ్గి. మా తండ్రి మా నాయ్న. నీ కడుపున పుడతాను...." అంటూ బ్రతిమలాడింది.

మాకయ్య వినలేదు.

* * *

రాక్షసకాంత లెవరో ఆడుకొని వదిలేసిన రాక్షసగొబ్బెమ్మల్లా ఉంటాయి ఆ కొండలు. ఆ కొండల్లో లోతట్టు ప్రదేశాల్లో ఆరేడు పల్లెల వరకూ వున్నాయి. అంకాలమ్మ కొండకి కుడివేపున నాలుగు కిలో మీటర్ల దూరంలో వుంది "చింతలొల్స". కొండకి కొంచెం దగ్గరగా వొచ్చి ఆగిపోయింది మెట్లంగి రోడ్డు. గట్టుపనికి కొండరాళ్ళనీ, గెడ్డనుంచి ఇసకనీ చేరవేసే లారీలకోసం తాత్కాలికంగా వేసిన రోడ్డు అది. ఆ తరువాత కాలిబాట. కొంతదూరం నడిస్తే గోర్జి వస్తుంది. రెండు ప్రక్కలా బ్రహ్మజెవుడు ముళ్ళపొదల్తో ఆ గోర్జి యిరుగ్గా వుంటుంది. గోర్జి నిండా ఇసక. వర్షం పడినప్పుడు మాత్రం గోర్జిలో మోకాళ్ళ లోతున నీళ్ళు ప్రవహిస్తూ వుంటాయి. గోర్జి దాటి చింతల తోపులోంచి వెళ్తే ఊరు కనిపిస్తుంది. ఆ చింతలతోపులోనే అరులప్ప చింతబొట్ట లేరుతూ మాకయ్యకి దొరికిపోయిందిప్పుడు.

ఆ చుట్టు పక్కల నాలుగయిదు ఎకరాల విస్తీర్ణంలో పది పన్నెండు చింత చెట్లున్నాయి. దొరలు తరతరాలుగా కొండల మీద పోడుపెట్టుకుంటూ అడవిలో కర్రలు కొట్టుకుంటూ, మెట్ట వ్యవసాయాలు చూసుకుంటూ—వాటితోపాటే ఆ చింతచెట్ల ఫలసాయంకూడా అనుభవిస్తూ వస్తున్నారు. వాస్తవానికి వాటిమీద ఎవరి అధికారమూ

లేదు. తాత తండ్రుల కాలంనుంచీ ఆనవాయితీగా ఎవరు నమ్ముకున్న చెట్లు ఆ కుటుంబంవాళ్ళే చూసుకుంటూ వస్తున్నారు. ఎవరి చెట్లు వాళ్ళవే. ఒకరి చెట్లజోలికి మరొకరు రావడం వుండేది కాదు. కాని రోజులు మారిపోయేక ఆ పద్ధతులూ, ఆ కట్టుబాట్లూ కూడా మారిపోయాయి. ఇప్పుడా స్వేచ్ఛ లేదు. ఆ ప్రాంతాల్లో భూములు కొనుక్కుని అక్కడే ఉంటున్నవాళ్లూ, మునసబు, కరణం, ఆరెయ్యా, ఇతర రెవిన్యూ అధికారులూ అందరి పెత్తనమూ వాటిమీదే. అధికారులు వొచ్చిఆ చెట్లు వేలం వేస్తారు. వేలం పాడుకున్న వాళ్ళకే ఆ చెట్లకి కాసిన చింతబొట్టలు ఏరుకోడానికి హక్కు ఏర్పడడం కొత్తగా వచ్చిన పరిణామం. ఆ వేలంవల్ల వచ్చిన డబ్బు గ్రామపంచాయితీకి జమ చెయ్యాలి. వేలం అయితే పద్ధతి ప్రకారం జరుగుతుంది కాని, ఆ డబ్బుకి సరిగా రశీదులిచ్చి పంచాయితీనిధుల్లో జమ చెయ్యడం మాత్రం అనుమానమే. అప్పో సప్పో చేసియాభై కో వందకో వేలం పాడుకుని పొందిన హక్కు కాస్తా— ఏరిన చింత పండు డబ్బుగా మారే వరకూ ఎన్నో ఆటుపోట్లకి లోనయిపోతుంది. అందులోనే అధికార్లకీ అనధికార్లకీ మామూళ్ళు—సరైన ధర యిచ్చినా యివ్వకపోయినా జలగల్లా వేధించుకుతినే గిరిజన్ కార్పొరేషను వాళ్ళూ— తూనికలో మోసాలు, లెక్కల్లో తిరకాసులు— ఇలా ఎన్నో!

అయితే— నిన్నా మొన్నటి వరకు ఆఫీసర్లొచ్చి వేలం వేసేవరకు చెట్లనుండే బొట్టల జోలికి ఎవరూ వెళ్ళకపోయినా, గాలికి రాలిపోయి నేలమీద పడినదాన్ని ఏరుకోడానికి ఎలాంటి అభ్యంతరమూ ఉండేది కాదు. పైపెచ్చు గాలికి రాలిన బొట్టలు ఎవరికి దక్కింది వాళ్ళుఏరుకోవడం అనూచానంగా వస్తున్న అలవాటే.

కాని—

లచ్చిందేవి మెళ్ళో గుత్తులు గుత్తులుగా మెరిసిపోయేబంగారం ఆభరణాల్లాగా ఈఏడు వెర్రికాపు కాసిన చింతచెట్లనిచూసి కిష్టయ్య బుర్రలో పురుగు దొలిచింది. గాలికిరాలిన సరుకు కూడా ఏరుకోడానికి వీల్లేదని కట్టడి చేశాడు.

దాని ఫలితమే యిప్పుడు అరులప్ప కిష్టయ్య మిద్దె యింటి ముందు కాళ్ళలో రక్తాలు దిగుతున్నా యిలా దీనంగా నిలబడవలసిన పరిస్థితి ఏర్పడడం.

* * *

మాకయ్య అరులప్పని తీసుకుని కిష్టయ్య దగ్గరకి రావడం చూసి తవుడు, సింహాద్రి, ఆదెయ్య మొదలయిన వాళ్ళంతా మెల్లిగా అక్కడికిచేరారు. ఎన్నడూ లేని కొత్త ఆంక్ష కిష్టయ్య ఈ యేడే పెట్టడం వాళ్ళలో చాలా మందికి నచ్చలేదు. అయితే వాళ్ళంతా కిష్టయ్య చేతిలో చిక్కి గిలగిలలాడిన వాళ్ళే కనక ఎదిరించే దమ్ములెవరికీ లేవు. అర్లప్పకి కిష్టయ్య ఎంత జరిమానా చెప్తాడోనని అనుకుంటూ మవునంగా నించుని చూస్తున్నారు.

చాలా సేపటికి యింట్లోంచి బయటికొచ్చేడు కిష్టయ్య. వాళ్ళ మీద, వాళ్ళ బతుకుల మీద అధికారం కిష్టప్ప స్వయంగా సంపాదించుకున్నవి కానీ, ఎవరూ యిచ్చినవి కాదు. ఆ నిబ్బరం, తీవి అతని ప్రతి కదలికలోనూ కనిపిస్తూనే వుంటుంది.

చేతిలో చుట్టని కొంచెం కొరికి తుపుక్కున వుమ్ముతూ మంచం వాల్చుకుని దానిమీద చతికిలపడ్డాడు. అరులప్పని చూస్తూ బండబూతుల్తో తిట్టిపోశాడు. దొంగతనంగా చింత బొట్టలేరుకున్నందుకు సంజాయిషీ అడిగేడు.

అప్పటికే అరులప్పకి కళ్ళలో ఏడుపింకిపోయింది. ఒంట్లో వణుకు కొంచెం తగ్గి తెగింపులాంటి దొచ్చింది.

"గాలికి రాలిన బొట్టలేరతన్నానుబాబు. తప్పేటుందండల ?" అని అడిగింది.

కిష్టయ్య ఉరిమురిమి చూసేడు.

"అలాగ్గ ఏరుకోనానికి యీల్లేదని సెప్పానా నేదా ?" అడిగాడు కోపంగా.

"అదేటి బావ్ అలగంతవు? కిందటి యెగళ్ళకి నేదిలాగ. ఇదేటీపాలి కొత్తగా యీపితలాటక మెట్టానవు ? సెట్టుకున్న బొట్టని కొడితే నువ్వు సెప్పిందే నాయం....కాని గాలికి రాలిపోయినదానికి ఏరుకోనానికి అక్కు అందరికీ నేదా ? మా తాతల్నాటి నుంచి అలాగే కదా సేస్తన్నారు ?" అంది.

అరులప్ప ఎదురు తిరగడంతో కిష్టప్ప ముఖం రంగులు మారిపోయింది. తెయ్యిమని దానిమీదకి యింతెత్తుకి లేచాడు.

"నోర్ముయ్ ముండా-మళ్ళీ పేలినావంటే దవడపళ్ళు ఛటాల్ ఫటాల్న రాలగొట్టీగల్ను. కొట్లతోయించేస్తాను జాగర్త. నాకు బోదసేసీపాటి నాయురాలి వై పోనావేటే నెంజా" అంటూ ధాంధూం లాడిపోయేడు.

అరులప్పకికూడగట్టుకున్న ధైర్యం మళ్ళీ సడలిపోసాగింది. నిస్సహాయంగా చుట్టూ చూసింది. ఎవరూ పెదవి విప్పలేదు. తనకెక్కడెవరూ మాటసాయంకూడా చెయ్యరని తెలిసిపోయాక ఆమెలో మొండి తెగింపు వచ్చింది.

"రాలిన పండేరుకుంటే యింత యాగీ సేస్తనావేటి బాబూ...." అంది బింకంగా.

కిష్టయ్య వెటకారంగా నవ్వేడు. "రాలినదయితేమాత్రం-ఎవులకిబడితే ఆల్లు నొల్లుకుపోడవేనేటి? మొగుడొదిలేసిన ఆడదాయివి నువ్వు- ఎవులకిబడితే ఆల్లు నాక్కుపోతున్నారేటి నిన్ను?" అంటూ ఆమె అభిమానాన్ని ఎక్కడ దెబ్బతీయవచ్చో అక్కడ దెబ్బతీశాడు.

అరులప్పకి నేలా, ఆకాశం, అడవీ

## నా గురించి



నా వెనుక ముప్ఫయ్ నాలుగేళ్ళ వయసూ, పదహారేళ్ళ కథ్లరాసే వయసూ ఉన్నాయి. నాదగ్గర ఆంధ్రజ్యోతి (గోవుమాలచ్చిమికి కోటి దండాలు), ఆంధ్రభూమి (ఊరికి నిప్పంటుకుంది), ఆంధ్రపత్రిక (మనిమరకలు) — ఈ పత్రికలలో బహుమతు లందుకున్న నా కథలున్నాయి. అచ్చయిన కథలు రెండొందలు. హిందీలోకి అనువదించబడిన కథలు రెండూ ఉన్నాయి. ఒక భాషాప్రవీణ; ఒక ఎం. ఎ. పట్టా, సాలూర్ ప్రభుత్వ జూనియర్ కాలేజీలో తెలుగు టీచర్ ఉద్యోగం ఉన్నాయి. నవలాప్రచురణ లాభసాటి అయిన యీ రోజుల్లో ప్రచురణ సంస్థలు తెలుగు కథని మంచం దింపేసేయన్న బాధ నాలో ఉంది. మంచి కథా సంపుటాలు విరివిగా ప్రచురించబడేందుకు సరైన ప్రయత్నం జరక్కపోదనే ఆశా వుంది.

"మనుషులు చెడిపోవడానికి అనేకమార్గాలూ, కారణాలూ వుంటాయి. కానీ ముఖ్యం - రచయితలు మాత్రం చదవకపోయినా, రాయకపోయినా చెడిపోతారని" నన్ను ఎప్పుడూ ప్రోత్సహించే ఆప్తులూ, రచయిత మిత్రులూ - కంథు, కాళీపతిరావ్, దాట్ల, పతంజలి, డాక్టర్ బి.ఎస్.ఎన్. మూర్తిగారూ (ఇంకా ఎందరో) వీళ్ళున్నారు.

నా ఎదుట మాత్రం - రచయితగా నా బాధ్యతని గుర్తుచేస్తూ ఎన్నో ప్రశ్నార్థకపు గుర్తులు....

నా కథకి బహుమతిచ్చిన ఆంధ్రజ్యోతి వారపత్రిక సంపాదకులకు నా కృతజ్ఞతలు.

—వంతుల జోగారావు

కొండలూ అన్నీ గిర్‌న తిరిగిపోయినట్ల యింది. ఏడుపు మళ్ళి కుమ్మి కొచ్చింది. బేలగా చూస్తూ వుండిపోయింది.

కిష్టయ్య తీర్పు చెప్పేశాడు.

"మీకు దినావూ కూలి పని యిప్పిస్తుంటే కళ్ళు నెత్తిమీద కొచ్చినాయే సిత్కారీ నెంజా.... సేసిన పనికి పంచాయితీకి పాతిక రూపాయలు జరిమానా కట్టు — మరింక రేవట్నుంచి గట్టు పనికి నువ్వూ రావొద్దు. నీ అయ్యా రావొద్దు. కంట్రాట్రు బాబుతో మీ పేర్లు పట్టీనోంచి కొట్టీమని సెప్తాను. ఎల్లు — అప్పటికొ్కాని నీ తెగులు కుదర్దు. పో....పొండిరా ఎదవ ముకాలూ మీరూను. ఏట్రా సూత్తన్నారు సిట్రాలు? ఏలం పాట లయిదాక సింతసెట్ల జోలికెవరెల్నా మీకూ యిలాగే అవుద్ది. పొండి" అని కసురుకుని విసవిసా వెళ్ళిపోయేడు కిష్టప్ప.

ఆ తీర్పుకింక తిరుగులేదు.

ఆరపండిన చింత బొట్టలు చిమ్మ గాలి కూ్కడా రాలి పోతున్నా సరే ఆఫీసర్లెంచేత రారో. వేలంపాట వాయిదా లెందుకు పడు


# మీ చిగుళ్లను దృఢంగా వుంచుకోండి
# మీ పళ్లకు దీర్ఘ ఆయుస్సునివ్వండి



## కేవలం ఫోర్‌హెన్స్‌లో మాత్రమే చిగుళ్లను దృఢపర్చగల ఒక ప్రత్యేకమైన అస్ట్రింజంట్ కలదు

**ఝల్లుమనిపించే అనుభూతి ఇది పనిచేస్తున్నట్టుగా తెలుపుతుంది.**

ఆరోగ్యవంతమైన పళ్లకు కూడా గట్టి చిగుళ్ల ఆధారం అవసరం. చిగుళ్లు బలహీనమై మెత్తబడి పోయాయంటే మీ పళ్లకున్న గట్టి ఆధారం సడలిపోతుంది. అందుకే, చిగుళ్ల జీవధాతువును సంకోచపరిచి, బిగుతు చేయడానికి సహాయపడే ఒక ప్రత్యేకమైన అస్ట్రింజంట్‌తోటి సూత్రీకరించబడింది, ఫోర్‌హెన్స్. ఫోర్‌హెన్స్‌తో మీ పళ్లను బ్రష్ చేసుకుంటున్నప్పుడు మీకు కలిగే ఆ ఝల్లుమనిపించే అనుభూతి ఆ అస్ట్రింజంట్ చర్య వల్ల కలిగిందే. అదే, మీ చిగుళ్లను గట్టిగా, బిగుతుగా చేస్తున్న చర్య. దీనితో మీ పళ్లు ఆరోగ్యంగా మరింత కాలం నిలుస్తాయి.

కనుక మీ పళ్లకొక గట్టి ఆధారం కల్పించండి—ప్రత్యేకమైన అస్ట్రింజంట్ గల ఫోర్‌హెన్స్ టూత్‌పేస్ట్‌ను వాడండి.



మీ చిగుళ్లు బలహీనమైపోతే ఆరోగ్యవంతమైన పళ్లు కూడా వదులై పోతాయి.



ఫోర్‌హెన్స్‌లోని ప్రత్యేకమైన అస్ట్రింజంట్ చిగుళ్ల జీవధాతువును బిగుతు చేస్తుంది.



దీనితో మీ చిగుళ్లకు మరింత బలం, మీ పళ్లకు మరింత ఆయుష్షు.




**ఫోర్‌హెన్స్‌ను విశ్వసించండి!** ఇది పళ్ల డాక్టరు సృష్టించిన టూత్‌పేస్టు.

206F.203 TEL

తోందో, నేలరాలిన పండు ఎవరికి చేరుతోందో ఆలోచించే ధైర్యంలేని ఆ జనం— మారు మాట్లాడకుండా అక్కడినుండి కదిలారు.

* * *

అరులప్ప తెచ్చిన చింతబొట్టల తగువు చాలా దూరం వెళ్ళింది. కిష్టయ్య అరులప్ప మీదా, ఆమె తండ్రి మునలయ్య మీదా కత్తి గట్టేడు. అన్నట్టుగానే వాళ్ళిద్దరికీ ఆయకట్టు పన్లోకి రానివ్వకుండా చేసేసేడు. అరులప్ప కట్టాల్సిన జరిమానా కింద వాళ్ళ బాకీకూలి డబ్బులు విరిచేసుకున్నాడు. బతిమాలుకుందామని వెళ్ళిన మునలయ్యని నానా దుర్భాషలూ ఆడి గెంటేసేడు.

"కిష్టయ్యబాబూ, మాఅర్లు తెలీక సేసింది. ఎర్రినంజ కక్కుర్తి పడినాది. నువ్వు మామీద కోపగిస్తే ఎలాగయ్యా? మాం బతుకులో అన్నిందాల నాశినం అయిపోనాం కద బాబు....మాకేటి మిగిలాన్నది సెప్పు.... బూడి త్తప్ప మరేటి మిగలేన్నదు. గట్టొచ్చి గంగమ్మ తల్లికి అడ్డకట్టేసినాది కాని— మా బతుకులు తుడిసిపెట్టుకుపోనాయి కద? నున్నగసెడిపోనాం కద తండ్రీ? నీకు తెలందేటుంది కిట్టయ్యబాబు. అన్ని యవ్వారాలు నడిపించింది నువ్వే కద. కొరట్ల మాకు నేయంగ రావల్సిన డబ్బు కోసం తిరగనేదా? అరి కాళ్ళు యీరి కాళ్ళు మాకోసం పట్టుకోనేదా? మాకు మంచి సేద్దాంవని నూసేవు. మా నెత్తిన పెద్దమ్మ దిద్దిమ్మని గెంతుతుంటె నువ్వుమాత్రం వేటి సేస్తావు. గట్టుపనికి రానియ్యకుండ ఆ కూల్డబ్బులు కూడ దొరక్కుండ సేస్తే మేమేటైపోవాల- నాయన్నాయన్న- ఈసుట్టు మా తప్పుకాయి నాయన-నీకు దణ్ణంవెడ్తన్నాను" అంటూ కన్నీరు మున్నీరుగా ఏడిచాడు మునలయ్య.

కిష్టయ్యకి వాడి మాటల్లో దీనత్వంకన్నా ఏదో వెటకారం. వెక్కిరింత మాత్రమే ధ్వనించింది. వాడి రోదన కిష్టయ్యని కరిగించలేకపోయింది.

"అవున్రన మునలయ్య.నీకునష్టవొచ్చింది నిజవే. కాదన్ను. అయితే మన గేమాలకి గట్టురావడమే తప్పంటావేటి? అంత డబ్బు పోసి గట్టు కడతన్నారంటె కొంతమంది బూంవులకి ముంపు వొస్తే వస్తాది. కొంత మంది నష్టంవొస్తే వస్తాది. మన చింతలావ్పకి ముంపు బాద నేదు గనక తలదాచుకోడానికి పాకలేనా మిగిల్నాయి— అటికూడా ముంపొస్తే ఏటి సేస్తావు రారే.... ఇంతకీ నాకు మాత్రం వేటి డబ్బొచ్చి పడిపోనాది.... ఆళ్ళిచ్చిన కాంపన్సేసను డబ్బు నాయంగ నాకు మాత్రం సరిపోనాదేటి — నానూ నష్టపోనాను. గట్టత్తల మడిసెక్కకొనుక్కున్నాను గనక దైర్నంగున్నాను.. నేకపోతే నేనూ నీలాగే బికారోడ్నయి పోయీవోడ్ని.... నా కుటుమానం కూడా యీదిని పడిపోయి యేడిసివుండే వాళ్ళంవే.. మరన్నేటడక్కు— గట్టుపనికి రావద్దంతే — ఆ ముండకి మొగుదొదిలీసిన కాడినుంచి మదం— మదంవెక్కి పోనాది. ఇయ్యాల నన్నెదిరించినాది — రేపు నీ మీద తిరగబడతాది .... మరందుసేత బాబూ, నీకూదానికీ ఓ దణ్ణం-వెళ్ళు" అని కసురుకుని పంపించేసేడు.

మునలయ్య కేం చెయ్యాలో తోచలేదు. బరువెక్కిన గుండెతో గుడిసె చేరాడు. అరులప్ప ఎదురొచ్చి ఏదో అడగబోతే ఆ బాధలో దాన్ని చెడా మడా తిట్టేశాడు. పాకలోకి వెళ్ళి నులకమంచం వాల్చుకుని దానిమీద అడ్డంగా పడిపోయేడు. అరులప్ప ఏడుస్తూ ఓ మూలకెళ్ళి కొంగు పరుచుకుని పడుకుంది. వాడికి ఏడుపొస్తోంది. నీళ్ళు నిండిన వాడి కళ్ళకి, ఆ పాక శ్మశానంలా తోచింది. బుగిలమ్మ ఉండేటప్పుడు ఎలా గుండేది! రోజూ పేడతో అలికి ముగ్గులు పెట్టేది. ప్రతీ ఏడాది కమ్మ తిరగేయిస్తే కాని ఊరుకుండేది కాదు. ఇప్పుడో—చూరు లోంచి కర్రలు ఏ క్షణంలో నయినా జారిపోయేలా ఉన్నాయి. తట్ట గరిసెని పంది కొక్కులు కొరికేసి చిందర వందర చేసేసేయి— అందులో ఇప్పుడాక్క గింజలేదు. అప్పట్లో పంటరాగానే గింజల్తో నిండుగా అమ్మతల్లిలా వుండేదది. బుగిలమ్మ దానికి వారానికోసారి కుంకుమబొట్లు పెట్టి, సొంత బిడ్డల్ని చూసుకున్నట్టు చూసుకునేది.. మునలయ్యకి అవన్నీ గుర్తొచ్చి గుండె తరుక్కుపోయింది. పక్కకి తల తిప్పి చూసేడు అరులప్ప వేపు.


సన్నని వెక్కిళ్ళ మధ్య అరులప్ప ఏడుపు— ముళ్ళ కంచె మీదనుంచి ఫర్ ఫర్రన బట్ట లాగుతున్న చప్పుడులాగ వినిపిస్తోంది. కూతురిమీద నోరు చేసుకున్నందుకు తననితనే తిట్టుకున్నాడు. జరిగిన విషయాలన్నీ ఒక్కొక్కటే గుర్తుకొచ్చి వాడికి కడుపు దేవుకుపోసాగింది.

* * *

ఉన్నట్టుండి ఆఫీసర్లు జీపులమీద తమ ఊరికి రావడం చూసి చింతలవల్స ప్రజలు ఆశ్చర్యపోయారు. ఎవరో ఒకరు వస్తూ పోతూండడం హడావుడి చెయ్యడం చూసి, అర్థం కాకపోయినా తమకేదో మేలు జరగబోతోందని ఆశ పడి సంతోషించేరు. కాని- ఎస్టిమేషన్లూ, కొలతలూ పూర్తయి ఆయకట్టు నిర్మించేక తమ భూములే ముంపుకి గురయిపోతాయని తెలిసిన మరుక్షణంలో వాళ్ళకి వెన్నెముక విరిగిపోయినట్లయింది. కళ్ళముందు చీకటి పొగలు క్రమ్మినట్లయింది. డిక్లరేషను ఫారాలిచ్చి వేలిముద్దర్లు వెయ్యమంటే దేవుడిమీద భారంవుంచి వేసేసీరు సర్వేయర్లు వొచ్చి భూముల కొలతలు తీసుకుని వెళ్ళిపోయారు. పల్లానికి రెండువేలు, మెట్టుకి పదహారువందలూ లెఖ్ఖన కాంపన్సేషను ఖాయం చేసి ఆఫీసర్లు వెళ్ళిపోయేరు.

పరిస్థితి అవగతమయ్యాక మునలయ్య ఆకులా వణికిపోయాడు. వాడి దుఃఖానికి అడ్డుకట్ట లేదు.

ముంపు ప్రాంతంలో కిష్టయ్య భూములు కూడా ఉన్నాయి. నలభై ఎకరాల పల్లం. ఏడెకరాల మెట్ట వుంది. మెట్టభూమి వుంచుకొని పల్లం భూములన్నీ ముందే అమ్మేసేడు. ఆశపడి ఓ అరెకరం కొన్నవాళ్ళలో మునలయ్య కూడా ఒకడు. అప్పటికింకా గట్టొస్తుందన్న వూసెవరికీ తెలీదు. ఇక్కడ భూములమ్మేసి రాయవల్స అత్తారి ఊర్లో ఒట్టి భూములు కొంటానని అందరికీ చెప్పేవాడు. కాని ఆ డబ్బుతో పొగాకు వ్యాపారం




చేసేడు. నారవ్యాపారం చేసేడు. చింత పండు బిజినెస్సు చేసేడు. చాలా ముందుగానే ఎవరికీ తెలీకుండా గట్టు దిగువ భూముల్ని చవకగా కొనీసేడు. అతనికా భూముల్ని అమ్మినవాళ్ళు ఆనకట్టు వస్తుందని తెలిసిన రోజున కుళ్ళి కుళ్ళి ఏడ్చారు.

మొదటి సంవత్సరం వంట కోసుకోడానికి ఆటంకం లేకపోయింది. కాని. తొలకరి జల్లులు పడి మళ్ళీ దుక్కి దున్నుకునే రోజులొచ్చేసరికి భూముల్ని స్వాధీనం చెయ్యమంటూ ఆర్డర్లొచ్చాయి.

ఊరు వూరంతా గొల్లుమంది. కొంపల్లో శవాలు లేచినట్టు రాత్రీ పగలూ ఆడవాళ్ళూ, పసిపిల్లలతో పాటు అందరూ ఒకటే ఏడుపు. అది దుఃఖం కాదు. అది కన్నీరు కాదు. కడుపు తరుక్కుపోయే ఆ రోదన ఆ కొండల్లో గింగుర్లు తిరిగి తిరిగి చల్లబడిపోయింది. రెక్కలు తెగిన పక్షుల్లా విలవిలలాడి పోయేరంతా.

తరతరాలుగా నమ్ముకొని వస్తున్న భూమిని ఏడుస్తూనే అప్పగించేసేరు. రోగ




మొచ్చినా. రొష్టొచ్చినా — పెళ్ళొచ్చినా పేరంటం వొచ్చినా ఆ నేలతల్లి కనికరించి తమ బాధల్ని తీరుస్తుందని ధైర్యంగా వుండేవాళ్ళు. పండినా ఎండినా దాన్నే నమ్ముకుని దానిమీద కొండంత ఆశలు పెట్టుకుని బ్రతికేవాళ్ళు.

అంతా పోయేక రోజులు గడవటం దుర్లభమైపోయింది. దున్నుకోడానికి భూమీ లేదు. చేతికి పనీ లేదు. కాంపనేస్షను డబ్బు కూడా చేతికందడానికి ఎన్నో అడ్లు. ఆటంకాలు. వెర్రిగొర్రెలు కసాయివాడ్ని నమ్మేయి. కిష్టయ్య అందర్నీ వెంటేసుకుని పట్నం ఆఫీసుల చుట్టూ తిరిగేవాడు. పైకి మహజర్లు పంపించేవాడు. ఆ ఖర్చనీ. యీ ఖర్చనీ వాళ్ళదగ్గర ఉన్నదంతా వూడ్చుకున్నాడు. గొడ్డూ గోదా అమ్ముకున్నాక కొంపలు గుల్ల చేసుకున్నాక— ఆ డబ్బు చేతికి వస్తున్నట్టే వచ్చి మళ్ళీ చేజారిపోయింది.

తవుడు. నరిసింగు. సింహాద్రి. మునలయ్య— వీళ్ళందరి భూములమీదా పేచీలొచ్చాయి. ఆ భూముల పట్టాదారులమంటూ. ఆ డబ్బు తమకే చెందాలంటూ కొందరు కేసులు పెట్టారు. దాంతో మొత్తం వ్యవహారం కోర్టుపాలయింది. ఆ తర్వాత వాళ్ళందరికీ మళ్ళీ కిష్టయ్యే దిక్కయేడు. కోర్టులో వ్యాజ్యం నడిపించడాని కియ్యే మొత్తం డబ్బు ఎంతకాలమయినా సరే మదుపుగా పెట్టడానికని చెప్పి వాళ్ళ దగ్గర పత్రాలురాయించుకున్నాడు. మదుపు అతనే పెట్టేడు. కేసులు తేలేవరకూ— పిడికెడు గింజలకీ. మందులకీ మాకులకీ. చావులకీ పుట్టుకలకీ అన్ని ఖర్చులూ వడ్డులు రాసుకొని కిష్టయ్యే ఇచ్చేవాడు.

అప్పుడా సమయంలో వాళ్ళ కళ్ళకి అతడు దేవుడిలా కనిపించేవాడు.

ఆ దేవుడే తమ పాలిట దెయ్యమవుతాడని వాళ్ళకి చాలా ఆలస్యంగా కానీ తెలిసి రాలేదు.

ప్లీడర్ల ఖర్చులూ. గుమస్తాల మామూళ్ళు. పెద్దంటేజీలూ అంటూ వాళ్ళు కోర్టుకేసుల్లో గెలుచుకున్నాక అందిన కొద్దిపాటి మొత్తంలోచాలాలాగేసుకున్నాడు. ఇంతకాలం మదుపుల క్రింద తను పెట్టిన డబ్బంతా హెచ్చువడ్డీతో గుంజుకొని వదిలిపెట్టాడు.

అప్పటికి వాళ్ళ చేతిలో మిగిలింది— వట్టుమని మూడు నెలల తిండిఖర్చుకి చాలదు.

దుక్కి దున్ని కష్టంవోడ్చి తృప్తిగా యిన్ని గింజలు పండించుకునే వాళ్ళంతా యిప్పుడు ఆనకట్ట పనికోసం కూలిచేస్తూ కండల్ని కరిగించుకొని కొండల్ని పిండి చేస్తున్నారు.

కిష్టయ్యమాత్రం కంట్రాక్టర్లతో జట్టు కట్టేడు. సూపర్‌వైజరు బాబులతో హాస్యాలాడే చనువు సంపాదించుకున్నాడు. ఇంజనీరు బాబుల యిళ్ళకి చింతపండు బుట్టలు పంపిస్తూ వాళ్ళచేత పెద్దమనిషని అనిపించుకుంటున్నాడు.

* * *

నుదుటిమీద చల్లని చేతి స్పర్శకి మెలకువ వచ్చింది మునలయ్యకి. అతని కళ్ళు మంటలు పెడుతున్నాయి. తల దిమ్ముగా. భారంగా పగిలిపోయేలా వుంది. నీరసంతో కడుపులో ఏదో గింగుర్లు తిరుగుతున్నట్టుగా వుంది.

సీతారామాంజనేయ సంవాదము
శ్రీ పరశురామ పంతుల లింగమూర్తి గురుమూర్తి ప్రణీతము
[శ్రీ వఝ్ఝల నారాయణ శాస్త్రుల వారి టీకా తాత్పర్య సహిత విశేష వ్యాఖ్యలతో]
ఇందులో: సర్వాత్మ భావనము- వైరాగ్య స్వరూపము- చతుర్వింశతి తత్త్వము- పరమాత్మ స్వప్రకాశత్వము- ఓంకార స్వరూపాది నిరూపణలు- వర్ణాశ్రమ ధర్మ వివేచనము- శ్రీరామ మంత్ర మహాత్మ్యము- శ్రీరామచంద్ర దర్శనా సౌలభ్య సూత్ర యోగము- యోగ భేదములు- అభ్యాస నియమములు- ఖేచరాది ముద్రలు- దశవిధ ప్రణవనాదములు- ఈశ్వరుని విరాట్స్వరూపము- జీవ బ్రహ్మైక్య విచారము- నైమిత్తిక ప్రళయ స్వరూపము మొ॥ సవివరణములుగా పొందుపరచబడినవి
శ్రీ వేదం వేంకటరాయ శాస్త్రిగారి సుదీర్ఘ పీఠిక- శ్రీ బాపుగారి త్రివర్ణ ముఖపత్రం అమూల్య అలంకారాలు!!
అందమైన ప్లాస్టిక్ కవరుతో వెల రూ॥ **50.00**
M.O. ద్వారా రు.45-00 పంపిన వారికి మిగతా రు. 5-00 లకే వి.పి.పి. ద్వారా పంపబడును.
శ్రీ అరుణా బుక్ హౌస్ * 103, నారాయణ ముదలి వీధి, మద్రాసు- 600 0

బరువుగా కళ్ళు విప్పి చూసేడు. ఎదురుగా తనవేపే చూస్తూ నిలబడి వుంది అరుఅప్ప. తండ్రి కళ్ళు విప్పి చూసేసరికి ఆందోళన తగ్గినట్టు నిట్టూర్పు విడిచింది. కొంచెం ముందుకి జరిగి అతని మంచం దగ్గర చతికిల పడింది. పక్కనే లొత్తలు పడిన సిల్వరు గ్లాసులో చల్లారిపోయిన బార్లీ నీళ్ళు తండ్రిచేత తాగించింది.

పైమీది చెమటతో తండ్రి ముఖం తుడుస్తూ భయపడుతూనే అంది–

"నీతో సెప్పకుండా ముక్కుపుడక అమ్మేసినాను....నచ్చిం వారం నాడు సింత సెట్లు ఏలమవుద్దంట- పరిశిగాడి సేత ఏలం పాడిద్దామనుకుంటన్నాను. కూలిపనెలాగూ పోనాది.... కొంపగడిసే దానికి దోవ సూసుకోవాలగదా...." అని.

ముసలయ్యకి ఒక్క క్షణంసేపు ఆమె ఏమంటోందో అర్థం కాలేదు. అర్థమయేక దుఃఖం ఉప్పెనలా ముంచుకొచ్చింది.

కూతురి ముఖంలోకి తేరిపార చూసేడు.

బుగిలమ్మ పోయేక తల్లి ముక్కుపుడక అరుఅప్ప కొచ్చింది. దాని ముక్కున ఆ ముక్కుపుడక చూస్తే బుగిలమ్మని చూసినట్టే అనిపిస్తుంది ముసలయ్యకి. అంచేత ఎన్నోసార్లు పొయ్యిలో అగ్గిలేక అరుఅప్ప దాన్ని కూడా అమ్మేస్తానంటే అంగీకరించలేదు.

బుగిలమ్మని అనుక్షణం గుర్తు తెచ్చే ఆఖరివస్తువుకూడా ఆకలికి బలై పోయింది.

దుఃఖం దిగమింగి అన్నాడు-"ఆ ఏలం అదీ మనకొద్దు తల్లీ-కిట్టయ్యకి కోపమొత్తాదమ్మా- ఆడికి కనికారం పుడితే మనల్ని మల్లగట్టుపనికి రానియ్యకపోడు...నా వొంట్లె కొంచం నిమ్మళించేక మల్ల ఆడి కాళ్ళమీద పడి బతిమాల్తాను. కాని ఆడితో మనకి తగువొద్దుతల్లీ...."కష్టాలు జీర్ణించుకుని జీర్ణించుకుని బండబారిన అతని గుండెలోంచి ఒక్కొక్క పదమే పిరికిగా,జీరగా వస్తోంది.

అరుఅప్ప విస్తుపోతూ తండ్రి ముఖంలోకి చూసింది. 'ఎన్ని తుపాను గాలులొచ్చినా సెక్కుసెదరని అంకాలమ్మ కొండనాగ — అయ్య మాత్రం యింతే' అనుకుంది మనసులో.

* * *

తండ్రి మంచం ప్రక్కనే చింకి చాప మీద నడుంవాల్చి మగతగా నిద్రపోతున్న అరుఅప్ప — వీధిలో వినిపించిన పెనుకేకకి తుళ్ళిపడి లేచింది.

పిడుగులాంటి కబురొచ్చింది.

కిష్టయ్య మనుషులు తెల్లవారక ముందునుంచే చింతచెట్లు దులిపేసుకుంటున్నారని!

రివ్వున వదిలిన బాణంలా లేచింది అరుఅప్ప. "ఏలంవేస్సినారేటి?" అడిగింది ఆత్రంగా.

కబురు తెచ్చిన బుడ్డోడు లేదన్నట్టుగా తల అడ్డంగా వూపేడు.

"ఏలంగీలం నేకండ—ఆపీసర్లు రాకండ ఆడి మనుసులు మాత్రం ఆటిజోలి కెందుకెల్నార్రా?" అంది ఆవేశంగా ఊగిపోతూ.

బుడ్డోడు జవాబు చెప్పలేక పోయేడు.

"ఆడికో నాయం.మనకో నాయంవూనేటి-గాలికిరాలినబొట్టలేరుకుంటేనా కాడజులాన్మనా ఏస్సి, మానోటికాడ కూడు దీస్నినాడు. మా బతుకుల నిప్పులుపోస్సినాడు-పదంద్రాయీ అన్నాయంవేదో సూద్దాం.నువ్వెళ్ళి తవుడ్నీ. సింహాద్రిమాయ్యనీ, ఆళ్ళనీ మనోళ్లందర్నీ పిల్చుకురా- బేగ. లగెట్టుకురా" అని వాడిని తొందర చేసి పంపించేసింది.

అరుఅప్ప మనసు అవమానంతోనూ, ఆవేశంతోనూ ఉడికిపోతోంది. గబగబా తండ్రి మంచం దగ్గరకొచ్చింది.

ముసలయ్య కూతురుకి ముల్లుగర్ర అందించేడు. ●

ఒత్తుగా, నిగనిగలాడే,
ఆరోగ్యకరమైన కేశములకొరకు
స్వస్తిక్
పెర్‌ఫ్యూమ్డ్
కేస్టర్
హెయిర్ ఆయిల్






రోజంతా మీ కేశములను అందంగా,
మువ్వినవి మువ్వినట్లే ఉంచేందుకు—
స్వస్తిక్ పెర్‌ఫ్యూమ్డ్ కేస్టర్ హెయిర్
ఆయిల్‌ను మీ కుటుంబంలోని
వారందరూ మెచ్చుకొంటారు.

స్వస్తిక్ హౌస్‌హోల్డ్ అండ్ ఇండస్ట్రియల్ ప్రోడక్ట్స్, బొంబాయి.

shilpi dm 13/78 tel